సాక్షి
పెద్దపల్లి
మంగళవారం, 3, అక్టోబర్, 2023



జీడీకే–5 ఓసీపీ సందర్శన

గోదావరిఖని: జీడీకే–5 ఓసీపీని ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్ సందర్శించారు. బొగ్గు ఉత్పత్తి పెంచాలని ఉద్యోగులకు సూచించారు.

న్యూస్‌రీల్

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



శ్రమదానం చేస్తున్న జడ్జి ప్రియాంక

సుల్తానాబాద్(పెద్దపల్లి): పరిసరాల పరిశుభ్రత ప్రతీఒక్కరి బాధ్యత అని మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి జీఎస్ఎల్ ప్రియాంక అన్నారు. సోమవారం స్థానిక కోర్టులో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. సిబ్బందితో కలిసి పరిసరాలు శుభ్రం చేశారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూసారాపు బాలకిషన్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి జోగుల రమేశ్, ఏజీపీ, మేకల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ ప్రకటనపై సంబురాలు



క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

ఓదెల(పెద్దపల్లి): మంత్రి కేటీఆర్ జిల్లా పర్యటన సందర్భంగా కొలనూర్‌ను మండలంగా ప్రకటిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు సోమవారం సంబురాలు జరుపుకున్నారు. బాణసంచా పేల్చుతూ, డీజే సౌండ్స్‌తో నృత్యాలు చేస్తూ, మిఠాయిలు పంచిపెట్టారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పెద్దపల్లి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఐరెడ్డి వెంకటరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల డైరెక్టర్ బండారి ఐలయ్యయాదవ్, సర్పంచ్ సామ మణెమ్మ, ఉపసర్పంచ్ పాకాల సంపత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఢిల్లీ శంకర్, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు రంగు రత్నయ్య, వార్డుసభ్యుడు జీడుల దివాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

8 వరకు ప్యాసింజర్ రైళ్లు రద్దు



రామగుండం: కాజీపేట – బల్లార్షా సెక్షన్‌లో రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనుల నేపథ్యంలో ఈనెల 8వ తేదీ వరకు పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో రామగిరి, పుష్‌పుల్, కాజీపేట ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

విదేశాల్లో ఉద్యోగావకాశాలు

పెద్దపల్లిరూరల్: విదేశాలల్లో పని చేసేందుకు ఆసక్తి, అర్హతగల అభ్యర్థుల కోసం ఈనెల 5న రామగుండం మండలం బ్రాహ్మణపల్లి ప్రభుత్వ ఐటీఐ మైదానంలో టామ్ కామ్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తామని జిల్లా ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ కింద నమోదైన రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ.. టామ్ కామ్ ద్వారా రాష్ట్రం నుంచి ఆసక్తి, అర్హత, నైపుణ్యం కలిగిన వారికి ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ డ్రైవ్ చేపట్టిందని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబరు 82478 38789/78935 66493/ 98496 39539లో సంప్రదించాలని కోరారు.

అరసం కార్యదర్శిగా ఏలేశ్వరం వెంకటేశ్




వెంకటేశ్

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనికి చెందిన ప్రముఖ కవి, రచయిత ఏలేశ్వరం వెంకటేశ్ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) రాష్ట్ర కార్యదర్శిగా, వై.లెనిన్ కార్యవర్గ సభ్యులుగా ఎంపికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో అరసం రాష్ట్ర మూడో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షుడు ఆర్వీ రామారావ్ ఎంపిక చేశారు. అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ, సాహితీవేత్తలు రాకుమారస్వామి, కన్నం లక్ష్మీనారాయణ, ఎలకటూరి శంకర్, వీరబ్రహ్మం, గట్టయ్య, మేజిక్ రాజా తదితరులు వారిని అభినందించారు.

గులాబీలో జోష్

- ఎన్నికల శంఖారావం పూరించిన మంత్రి కేటీఆర్
- కదనరంగంలో హోరుపెంచిన పార్టీ శ్రేణులు
- స్తబ్ధత వీడని ప్రతిపక్ష రాజకీయ పార్టీలు
- అభ్యర్థిత్వాలపై కానరాని స్పష్టతే కారణం!
- రక్తికట్టిస్తున్న 'జంపింగ్ జపాంగ్స్'



సాక్షి, పెద్దపల్లి: బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులను అధికారికంగా ప్రకటించింది. అభ్యర్థులు కార్యక్షేత్రంలోకి దిగినా.. మొన్నటిదాకా ఆశించిన స్థాయిలో ప్రచారం ముమ్మరం చేయలేకపోయారు. జమిలి ఎన్నికలు వచ్చే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం నేపథ్యంలో ప్రచార జోరు పెంచలేదని తెలుస్తోంది. అయితే, పార్లమెంట్ సమావేశాలు ముగియడంతో అసెంబ్లీ ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లయింది. దీనికితోడు ఆదివారం రామగుండం, పెద్దపల్లిలో నిర్వహించిన బహిరంగ సభల ద్వారా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లాలో ఎన్నికల శంకారావం పూరించారు. తనదైనశైలిలో ప్రగతిని ప్రజల ముందు ఉంచారు. ఇదేసమయంలో ప్రతిపక్షాల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమ అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామని ప్రజలకు హామీ వర్షం కురిపించారు. దీంతో జిల్లాలో ఒక్కసారిగా పొలిటికల్ హీట్ పెరిగింది. రాజకీయ హడావుడితో ఎన్నికల రంగస్థలం రాజుకుంది.

జనం బాట పట్టిన నేతలు

- అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎమ్మెల్యే అభ్యర్థులు అందరూ ప్రజలతో మమేకయ్యేందుకు పాదయాత్రలు, ఇంటింటా ప్రచారాలతో ప్రచార బాట చేపట్టారు.
- రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ 'ప్రజాఅంకిత యాత్ర పేరిట పల్లెనిద్ర–బస్తీబాట'తో ప్రజల ముగింటకు వెళ్లి వారితో మమేకమవుతున్నారు.
- మంథనిలో జెడ్పీ చైర్మన్, అక్కడి ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు 'ప్రజా ఆశీర్వాద పాదయాత్ర' పేరిట గ్రామాల్లో పర్యటిస్తున్నారు.
- మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి 'ప్రజా ఆశీర్వాదయాత్ర'తో ప్రచారంలోకి వెళ్లారు.
- కాంగ్రెస్ పెద్దపల్లి అభ్యర్థి విజయరమణారావు 'గడపగడపకు కాంగ్రెస్', రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థి మక్కాన్‌సింగ్ 'ప్రజాదీవెన యాత్ర', పెద్దపల్లి బీఎస్పీ అభ్యర్థి 'ఇంటింటికీ మన దాసరి ఉష' పేరిట ప్రజలను పలుకరిస్తూ రాజకీయ సందడి చేస్తున్నారు.

టికెట్ ఖరారు ఎప్పుడో..

బీఆర్ఎస్ పార్టీ తమ ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించటంతో కాంగ్రెస్, బీజేపీలు సైతం అభ్యర్థుల నుంచి ఇటీవల దరఖాస్తులు స్వీకరించాయి. పెద్దపల్లి పార్లమెంట్, పెద్దపల్లి, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీసీలకు టికెట్ ఖరారుపై కాంగ్రెస్ శ్రేణుల్లో టెన్షన్ నెలకొంది. అయితే, తమకే టికెట్ వస్తుందనే నమ్మకంతో పెద్దపల్లిలో విజయరమణారావు, రామగుండంలో మక్కాన్‌సింగ్ విస్తృతంగా పర్యటిస్తున్నారు. మిగిలిన కాంగ్రెస్, బీజేపీల్లోని ఆశావహులు టికెట్ ఖరారు అయ్యాకే ప్రచారం మొదలుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు.

ఉండేవారు ఎవరో.. పోయేవారు ఎవరో..

- ఎన్నికలు సమీపిస్తుండడంతో పార్టీలో అవకాశలు రానివారు, ప్రాధాన్యత దక్కనివారు, ఆత్మగౌరవం లభించనివారు, ఆర్థిక ప్రయోజనాలు, ఇతరత్రా కారణాలతో పార్టీ మారుతున్నారు.
- ఈక్రమంలోనే రామగుండం, మంథని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీలోకి కాంగ్రెస్, బీజేపీల నుంచి ఇటీవల వలసలు జోరందుకున్నాయి.
- పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు భారీగా సాగుతున్నాయి.
- రామగుండంలో బీజేపీ నుంచి కౌశిక హరి, కాంగ్రెస్ కార్పొరేటర్ గాదెం విజయ, 50డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు తదితరులు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.
- మంథనిలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సెగ్గెం రాజేశ్, మాజీ జెడ్పీటీసీ ఎల్లే శశిరేఖరాంమూర్తి, యూత్ కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ మాజీ ప్రధాన కార్యదర్శి జెంజర్ల శేఖర్ తదితరలు పార్టీలో చేరారు.
- పెద్దపల్లిలో మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజయ్య ఇటీవల రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిపోయారు.
- టికెట్ ప్రకటనతో నల్లా మనోహర్‌రెడ్డి పార్టీకి రాజీనామా చేయగా, మరో ఇద్దరు జెడ్పీటీసీలు పార్టీ మారేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.
- పెద్దపల్లి కౌన్సిలర్లు కొలిపాక శ్రీనివాస్, కొలిపాక సంధ్య పార్టీ మారేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.
- రామగుండంలో సోమారపు సత్యనారాయణ బీజేపీకి రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తానని ఇప్పటికే ప్రకటించారు.
- అసెంబ్లీ ఎన్నికలు వచ్చేలోగా వివిధ పార్టీల నాయకులు ఎవరు ఏ పార్టీలో ఉంటారోనని అన్ని పార్టీల శ్రేణులు చర్చించుకుంటున్నాయి.

గాంధీ ఆశయాలు కొనసాగిద్దాం



నివాళి అర్పిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: మహాత్మాగాంధీ ఆశయాలు కొనసాగిద్దామని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం గాంధీ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అలర్పించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుమోహన్‌తో పాటు అధికారులు రంగారెడ్డి, ఆదిరెడ్డి, డాక్టర్ ప్రమోద్‌కుమార్, చంద్రమౌళి, మాధవి, ఏవో శ్రీనివాస్, బండి ప్రకాశ్ పాల్గొన్నారు.

అణచివేతే కాంగ్రెస్ ఎజెండా

- జెడ్పీ చైర్మన్ పుట్ట మధు



స్వాగతం పలుకున్న పీఏసీఎస్ పాలకులు

మంథని: పేదోడు ఆర్థికంగా, రాజకీయంగా సహించలేని కాంగ్రెస్.. అణచివేయడమే ఎజెండాగా పెట్టుకుందని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు విమర్శించారు. అడవిసోమన్‌పల్లి, నాగెపల్లి వర్షపల్లి, వెంకటాపూర్, మల్లారం, ఆరెంద, ఖాన్‌సాయిపేట, భట్టుపల్లి, ఎగ్లాస్‌పూర్, రచ్చపల్లి, సూరయ్యపల్లి, కాకర్లపల్లి, నుంచి గంగాపురి వరకు సోమవారం ఆయన ప్రజాఆశీర్వాదయాత్ర కొనసాగించారు. ఆయన మాట్లాడుతూ, పేదలు రాజకీయంగా ఎదిగితే తమ కుర్చీలకే ప్రమాదమని ఎవరినీ ఎదగకుండా కట్టడి చేస్తున్నారన్నారు. తనలాంటి వాళ్లు ధైర్యంగా ముందుకు వస్తే అనేక అపవాదులు, అభండాలు, అసత్య ఆరోపణలతో ప్రజలకు దూరం చేయాలని కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మన ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే.. పదవిలోఉండి కూడా ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాళేశ్వరం భూనిర్వాసితులను లేనిపోని అబద్ధాలు చెప్పి మోసం చేశారని విమర్శించారు. భూములు కోల్పోయిన వాళ్లకు సరైన పరిహారం అందించేలా చర్యలు తీసుకున్నామని మధు గుర్తుచేశారు. ఇక్కడే కాదు.. సింగరేణి ఓసీపీ విస్తరణలోనూ భూములు కోల్పోయిన వారికి న్యాయం చేసిన చరిత్ర తనదే నన్నారు. అడవిసోమన్‌పల్లిలో గాంధీజీ చిత్రపటం వద్ద ఆయన నివాళి అర్పించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, ఎంపీపీ కొండ శంకర్ పాల్గొన్నారు.

రూ.2.5 కోట్ల అభివృద్ధి పనులకు టెండర్లు

- దరఖాస్తు దాఖలుకు నేడు చివరి గడువు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలోని పలు డివిజన్లలో పట్టణ ప్రగతి, జనరల్ ఫండ్‌కు చెందిన సుమారు రూ.2.50కోట్లు వెచ్చించి చేపట్టనున్న అభివృద్ధి పనులకు అధికారులు ఇటీవల ఆన్‌లైన్ ద్వారా టెండర్లు ఆహ్వానించారు. వాటిని దాఖలు చేయడానికి మంగళవారం మధ్యాహ్నం 3గంటల వరకు గడువు విధించారు. అదేరోజు సాయంత్రం ఆన్‌లైన్‌లోనే టెండర్లు తెరుస్తారు. కాగా, తాము కోరుకున్న పనులకు కాంట్రాక్టర్లు టెండర్లు వేయవద్దని కొందరు నాయకులు ఒత్తిళ్లు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. సుమారు 13 అభివృద్ధి పనులకు ఎంతమంది కాంట్రాక్టర్లు ఆన్‌లైన్‌లో టెండర్లు దాఖలు చేశారనేది మంగళవారం సాయంత్రం వరకు తేలనుంది. ఈ టెండర్లను దక్కించుకోవడానికి ఒకవైపు కాంట్రాక్టర్లు పోటీ పడుతుండగా, ఇంకోవైపు ప్రజాప్రతినిధులు కూడా తామేమీ తక్కువ కాదంటూ తీవ్రస్థాయిలో పోటీపడుతున్నారని ప్రచారం జరుగుతోంది.



గోదావరిఖని సమీప గోదావరి నదిలో నీటిపై తేలిన కాలుష్యపు నురగ

కాలుష్య గోదావరి

- నీటిలో మళ్లీ నురగ
- ఆందోళనలో నగరవాసులు

గోదావరిఖని: గోదావరిఖని సమీపంలోని గోదావరి నది పవిత్ర నీళ్లు కాలుష్యంగా మారాయి. సోమవారం నీటిలో నురగ ప్రత్యక్షం కావడంతో నగరవాసులు ఆందోళన చెందుతున్నారు. ఒక తెట్టులా సుమారు కిలో మీటరు పొడవున నదీ నీటిలో నురగ కనిపించింది. సింగరేణి కార్మిక వాడలు, నగరవాసులకూ నిత్యం గోదావరినది నుంచే నీటిని సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్‌ల్లోని భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేస్తూ ఎంతో పవిత్రంగా భావిస్తున్నారు. ఇందులో చేపల పెంపకంపై చాలాకుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. అయితే సోమవారం నీటిలో తేలిన కాలుష్యపు నురగతో సర్వత్రా ఆందోళన నెలకొంది. పరిశ్రమల నుంచి వెలుడిన వ్యర్థాలు నది నీటిలో కలుస్తున్నాయని, తద్వారా ప్రాణాంతక వ్యాధులకు గురవుతామని అంటున్నారు. గతంలోనూ ఇలాంటి నురగ తెట్టు కనిపించింది. కాలుష్య నియంత్ర మండలి అధికారులు రంగంలోకి దిగి శాంపిళ్లు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. అయితే, ప్రమాదకరమైన రసాయనాలేమీ నీటిలో కలువలేదని వారు అప్పట్లో స్పష్టం చేశారు. మళ్లీ నురుగ ఎందుకు వచ్చిందని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ భిక్షపతిని సంప్రదిస్తే.. మంగళవారం వెళ్లి పరిశీలించి చెబుతామన్నారు. అయితే ఈనీటిని తప్పనిసరిగా కాచిచల్లార్చిన తర్వాతే తాగాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సూచించారు.

నేడు ఎన్టీపీసీ జాతికి అంకితం

- నిజామాబాద్‌లో మోదీ చేతుల మీదుగా కార్యక్రమం



ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం తెలంగాణ ప్రాజెక్టులోని మొదటి యూనిట్‌ను ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం జాతికి అంకితం చేయనున్నారు. నిజామాబాద్‌లో నిర్వహించే సమావేశంలో ప్రధాని వర్చువల్ విధానంలో జాతికి అంకితం చేస్తారు. 800 మెగావాట్ల మొదటి యూనిట్‌లో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో 85శాతాన్ని రాష్ట్రానికి సరఫరా చేస్తారు. తెలంగాణ రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు అందించేందుకు ఎన్టీపీసీ 4,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈమేరకు రాష్ట్రానికి విద్యుత్ కేటాయించారు. కాగా, నిజామాబాద్‌లో జరిగే ప్రధాని సమావేశానికి ఎన్టీపీసీ రామగుండం ఉన్నతాధికారులు సోమవారం బయలుదేరి వెళ్లారు. ఇందులో ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్ కేదార్ రంజన్ పాండు, అధికారులు ఉన్నారు.

అహింసే బాపూజీ ఆయుధం



నివాళి అర్పిస్తున్న రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మేయర్ బంగి అనిల్‌కుమార్ తదితరులు

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: ప్రపంచానికి అహింసా సిద్ధాంతాన్ని అందించిన మహనీయుడు మహాత్మాగాంధీ అని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం గాంధీజయంతి సందర్భంగా స్థానిక ప్రధాన చౌరస్తాలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి శాంతియుత ఉద్యమాలతో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారన్నారు. గాంధీజీ ఆశయ సాధనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, కార్పొరేటర్లు ఇంజపురి పులేందర్, అడ్డాల స్వరూప తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాగూర్

సత్యం, అహింసా మార్గాల ద్వారా..

సత్యం, అహింసా మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహనీయుడు మహాత్మాగాంధీ అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ప్రధాన చౌరస్తాలోని గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. కాగా, రామగుండం మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ శివాజీనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు.



పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే సోమారపు

ఆరోగ్యమిత్రకు సత్కారం

పెద్దపల్లిరూరల్: పెద్దకల్వలలో సోమవారం పంచాయతీ కార్యాలయం వద్ద స్వచ్ఛతా హీసేవలో భాగంగా ఆయుష్మాన్‌భవ సభ నిర్వహించారు. విశేష సేవలు అందించిన ఆరోగ్యమిత్ర సురేశ్‌ను సర్పంచ్ రమేశ్ తదితరులు సత్కరించారు.

కొనసాగుతున్న సమ్మె

తమ సమస్యలు పరిష్కరించానే డిమాండ్‌తో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట మూడు రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నారు. వారి సమస్యలను పరిష్కరించాలని నాయకుడు భూపాల్ డిమాండ్ చేశారు.

ఆశయం మహోన్నతం

- లక్ష్యానికి మించి రక్తదానం
- విజయవంతమైన మెగా రక్తదాన శిబిరం
- ఒకేచోట, ఏకకాలంలో 6,166మంది రక్తదానం
- ప్రపంచ రికార్డుగా నమోదయ్యే అవకాశం ఉందన్న ప్రతినిధులు
- పోలీసు శాఖ, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధుల్లో ఆనందం



మెగా వైద్యశిబిరంలో రక్తదానం చేస్తున్న దాతలు

పెద్దపల్లిరూరల్: జిల్లా పోలీస్ శాఖ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో స్థానిక ప్రభుత్వ ఐటీఐ మైదానంలో సోమవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేయడం ధ్యేయంగా 6,006 యూనిట్ల రక్తం సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించగా యువత నుంచి అనూహ్య స్పందన వచ్చింది. మొత్తం 6,166 మంది దాతలు రక్తదానం చేయడంతో నిర్వాహకుల్లో సంతోషం వ్యక్తమైంది. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి శిబిరాన్ని ప్రారంభించారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఏకకాలంలో 6,166 మంది దాతలు ఒకేప్రాంతంలో రక్తం దానం చేశారని మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశంసించారు. గతంలో ఇంత పెద్దమొత్తంలో రక్తదానం ఎక్కడా లేదని, దీనిని ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కోసం పంపిస్తామని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్ కావేటి రాజగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ వైభవ్ గైక్వాడ్, ఏసీపీ మహేశ్, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాస్, జిల్లా చైర్మన్ కావేటి రాజగోపాల్, ప్రతినిధులు రవీందర్, వెంకటేశ్వర రావు, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాకారులు..

శిబిరం సమీపంలో కళాకారులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు, నాటికలు, గేయాలు అలరింపజేశాయి. రక్తదానంపై అవగాహన పెంచేలా ప్రదర్శనలు ఉన్నాయి.

ఏడు సొసైటీలు.. 14ప్రభుత్వ బ్యాంకులకు..

- రక్తదాన శిబిరంలో సేకరించిన రక్తం యూనిట్లను రాష్ట్రంలోని ఏడు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలు, 14 ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులకు అందించినట్లు రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర సభ్యుడు శ్రీనివాస్ తెలిపారు.

అవగాన పెంచారు..

- రక్తదానంపై ప్రజల్లో అపోహలు తొలగించేలా పోలీసులు మెగా రక్తదాన శిబిరం నిర్వహించారని ఎంపీ వెంకటేశ్‌నేత అన్నారు. ఇదేతీరును ఇతర ప్రాంతాల్లోనూ అమలు చేయాలని ఆయన నిర్వాహకులను కోరారు.

పోలీసులు అభినందనీయులు

- చరిత్రలో లిఖించదగిన విధంగా లక్ష్యానికి మించి మెగా రక్తదాన శిబిరం నిర్వహించడంలో పోలీసు యంత్రాంగం విజయం సాధించిందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పొగడ్తలతో ముంచెత్తారు. ప్రధానంగా గ్రామాల నుంచి దాతలు అధికసంఖ్యలో ముందుకు రావడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

ఆపదలో ఉన్నవారి కోసమే ..



ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకే దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేశారు. రక్తదానంపై కొంత అపోహ ఉంది. పోలీసుశాఖ చేపట్టిన మెగా శిబిరం ద్వారా ప్రజల్లో అవగాహన పెరిగి, దాతలు ముందుకొస్తారని ఆశిస్తున్నాం. లక్ష్యాన్ని మించి బ్లడ్ సేకరించడం చాలా సంతోషంగా ఉంది.

– రెమా రాజేశ్వరి, సీపీ, రామగుండం

ప్రాణదానమే..



రక్తదానం చేస్తే ఇంకొకరికి ప్రాణదానం చేసినట్టే. పెద్దపల్లి మెగా రక్తదాన శిబిరంలో యువకులతో పాటు ఈసారి మహిళలు కూడా ముందుకు రావడం మంచి పరిణామం. దేశ చరిత్రలో ఒకేరోజు ఇన్నియూనిట్ల రక్తాన్ని సేకరించిన సందర్భాల్లేవు. పెద్దపల్లి శిబిరానికి ప్రత్యేక గుర్తింపు దక్కింది.

– కావేటి రాజ్‌గోపాల్, రెడ్‌క్రాస్‌సొసైటీ జిల్లా కన్వీనర్

చాలా సంతోషంగా ఉంది..



రక్తదానం చేయడంలో సంతృప్తి ఉంటుంది. ఇప్పటివరకు 20సార్లు రక్తం, రెండు సార్లు ప్లేట్‌లెట్లు దానం చేశా. మెగా శిబిరంలో మా ఊరు యువకులను తీసుకొచ్చా. రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటాం. ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేసినట్లు అవుతుంది.

– దాసరి చంద్రారెడ్డి, కాసులపల్లి

క్లుప్తంగా

భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం ప్రారంభం



కేంద్రం ప్రారంభిస్తున్న భూపాల్

జ్యోతినగర్(రామగుండం): స్థానిక రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాల సాధన పోరాట కమిటీ భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రాన్ని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు కె.భూపాల్ సోమవారం ప్రారంభించారు. అంతకు ముందు నాయకుడు బిక్షమయ్య జెండా ఎగురవేశారు. నాయకులు వై.యాకయ్య, ఎ.ముత్యంరావు, ఎం.రామాచారి, వేల్పుల కుమారస్వామి, ఎ.మహేశ్వరి, ఎ.జ్యోతి, టి.రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మంథని: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రూ.10లక్షల వ్యయంతో చేపట్టే వాకింగ్ ట్రాక్ పనులను ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పట్టణవాసులు నిత్యం ఇక్కడ వాకింగ్, యోగా సాధన చేస్తారన్నారు. వారికి సౌకర్యంగా ఉండేందుకు అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు పెంద్రు రమాదేవి, హనుమంతరావు, నాయకులు ముస్కుల సురేందర్‌రెడ్డి, పోలు శివ, ఎల్లంకి వంశీ, నాంపల్లి సతీశ్, ఆజీంఖాన్, రావికంటి సతీశ్ తదితరులు ఉన్నారు.

బయోమెట్రిక్‌తో ధాన్యం కొనుగోలు

సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లాలో ఈ వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు అధికారులు బయోమెట్రిక్ పద్ధతి అమలు చేస్తారు. రైతుల నుంచి బయోమెట్రిక్, ఐరిస్ సేకరించాకే ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేయడంతో అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో వ్యాప్తంగా ఈసారి 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు.

లారీలకు జీపీఎస్..

కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లులకు ధాన్యం తరలించే లారీలకు కూడా జీపీఎస్ అమర్చాలని నిర్ణయించారు. తద్వారా కేటాయించిన ధాన్యం సదరు మిల్లుకు సక్రమంగా వెళ్తుందా, లేదా అనేది తెలుసుకుంటారు. సీజన్ ప్రారంభం నాటికి నూతన విధానం అమలు చేసేందుకు అన్నీ సిద్ధం చేసుకోవాలని సర్కారు ఆదేశించింది. ఈవిషయంపై డీఎం శ్రీకాంత్ మాట్లాడుతూ, ఈసారి బయోమెట్రిక్ ఆధారంగా ధాన్యం కొనుగోలు చేయాలని లేఖ అందిందన్నారు.

ఉద్యోగ భద్రత లేదు.. కనీస వేతనం రాదు

- దుర్భర జీవితాల్లో ఈజీఎస్ ఫీల్డ్‌అసిస్టెంట్లు
- సీఎం కేసీఆర్ హామీ అమలు చేయాలని విన్నపం



మొక్కలకు నీరు పోస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్(ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): ఉపాధిహామీ ఫీల్డ్‌అసిస్టెంట్లు దుర్భర జీవితాలు గడపుతున్నారు. జిల్లాలోని 266 గ్రామ పంచాయతీల్లో 171మంది ఫీల్డ్‌అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. 20 ఏళ్లనుంచి విధులు నిర్వర్తిస్తున్నా.. ఉద్యోగ భద్రత లేదు. కనీస వేతనం అందడంలేదు. గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పిస్తూ, జాబ్‌కార్డులు మంజూరు చేస్తూ, హరితహారం, ఫీల్డ్‌చానళ్లు, మొక్కల పంపిణీ.. లాంటి పనులు చేస్తున్నా శ్రమకు తగిన ఫలితం దక్కడంలేదు.

మధ్యప్రదేశ్‌లో ఉద్యోగ భ్రత..

- మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఫీల్డ్‌అసిస్టెంట్లకు అక్కడి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పిస్తూ, నెల వేతనం రూ.18వేలు చెల్లిస్తోంది.
- సీనియార్టీ ప్రకారం పంచాయతీ కార్యదర్శిలుగా పదోన్నతి కల్పిస్తూ వస్తోంది.
- ఈ విషయాన్ని మనరాష్ట్రంలోని ఫీల్డ్‌అసిస్టెంట్లు మొన్నటి వేసవిలో ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.
- తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ అవుట్ సోర్సింగు సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా నియమిస్తానని హామీ ఇచ్చారు.
- దీంతో తమను కూడా ఇలాగే గుర్తిస్తారని ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.

సౌకర్యాలు కల్పించాలని విన్నపం..

ఈజీఎస్ ఫీల్డ్‌అసిస్టెంట్లకు హెల్త్‌కార్డులు లేవు. బీమా సౌకర్యం కల్పించడం లేదు. పే స్కేల్ అమలు చేయడం లేదు. పని ప్రదేశాల్లో అనారోగ్యానికి గురైనా, పాములు, విషపురుగుల బారినపడి మృతి చెందినా వారి కుటుంబాలకు ఎలాంటి పరిహారం అందడంలేదు. క్షేత్రస్థాయిలో కూలీలతో కలిసి పనులు పర్యవేక్షిస్తూనే గ్రామపంచాయతీ కార్యాలయంలోనూ విధులు నిర్వర్తిస్తున్న తమ శ్రమను గుర్తించి కనీస సౌకర్యాలు కల్పించాలని వారు కోరుతున్నారు.

న్యాయం చేయాలి



నిత్యం ఉపాధికూలీలకు పనికల్పిస్తూ 24గంటలు పనిచేస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్లకు ప్రభుత్వం న్యాయం చేయాలి. కూలీలతో నిత్యం గ్రామాల్లో చాల పనులు చేయిస్తున్న వారికి న్యాయం జరగలేదు. ప్రభుత్వం సత్వరమే ఫీల్డ్‌అసిస్టెంట్లకు న్యాయం చేయాలి.

–మిట్టపల్లి లింగయ్య కూలీ, నాంసానిపల్లె

ఆరోగ్య భద్రత ఇవ్వాలి



ఇరవై ఏళ్లుగా దుర్భర జీవితాలు గడుపుతున్నం. మా సమస్యలను సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లినం. అయినా పరిష్కారం కాలేదు. వేతనాల మంజూరుతోపాటు ఆరోగ్యభద్రత కల్పించాలి. ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలి.

– మిట్టపల్లి సుధాకర్, ఫీల్డ్‌అసిస్టెంట్, నాంసానిపల్లె

ఉద్యోగులుగా గుర్తించాలి



ఈజీఎస్ ఫీల్డ్‌అసిస్టెంట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. మిగతా రాష్ట్రాల్లో మాదిరిగా కనీస సౌకర్యాలు కల్పించాలి. పేస్కేలు అమలు చేయాలి. హైల్త్ కార్డులు మంజూరు చేయాలి. తక్షణమే బీమా సౌకర్యం కల్పించాలి.

– వేల్పుల మల్లయ్య ఫీల్డ్‌అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు, పెద్దపల్లి

బొగ్గుబాయి వార్తలు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

రామగిరి: ప్రతీ ఉద్యోగి తన ఇంటితోపాటు కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు సూచించారు. సోమవారం ఓసీపీ–2లో స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 3.0 ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 31వ తేదీ వరకు పనిస్థలాల్లో పరిసరాల పరిశుభ్రత, కాలనీల్లో సుందరీకరణ చేపడతామని తెలిపారు. ఎస్‌వోటూ జీఎం రఘుపతి, మేనేజర్ కేవీ రామరావు, పర్యావరణ అధికారి కె.నాగేశ్వర్‌రావు, ఎస్ఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల తర్వాతే 'గుర్తింపు' నిర్వహించాలి

- హెచ్ఎంఎస్ నేత రియాజ్



మాట్లాడుతున్న రియాజ్

గోదావరిఖని: అసెంబ్లీ ఎన్నికల తర్వాతే సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం కుమ్మక్కై టీబీజీకేఎస్‌తో కలిసి ఎన్నికలు వాయిదా వేయాలని చూస్తోందని విమర్శించారు. అందరికీ సమాన హక్కు కల్పిస్తే ఎప్పుడు ఎన్నికలు జరిపినా అభ్యంతరం లేదని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు ఉన్న క్రమంలో గనులపై ఎన్నికలు జరిగితే రాజకీయ నాయకులు అడ్డాపెట్టి సింగరేణిలో రాజకీయ ప్రచారం పెరుగుతుందన్నారు. ఈక్రమంలో ఎన్నికలు వాయిదా వేయాలన్నారు. కోర్టును అడ్డంపెట్టుకుని మా జీతాలు అడ్డుకుంటే ఊరుకోబోమన్నారు. సమావేశంలో నాయకులు ఐ.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు..

- పుట్ట మధుకే పట్టం కట్టండి
- మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ



మైదంబండలో పాదయాత్ర చేస్తున్న పుట్ట శైలజ

ముత్తారం: నిత్యం ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకునే జెడ్పీ చైర్మన్, మంథని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్‌కు రానున్న ఎన్నికల్లో పట్టం కట్టాలని మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ కోరారు. మచ్చుపేట, మైదంబండ, పోతారం, లక్కారం, హరిపురం, కేశనపల్లి, ధర్యపూర్‌లో సోమవారం చేపట్టిన ప్రజాఆశీర్వాద యాత్రలో ఆమె మాట్లాడారు. సెప్టెంబరు 25న ముత్తారం నుంచి ప్రారంభించిన ప్రజాఆశీర్వాద యాత్ర నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కొనసాగుతోందని, ఆ తర్వాత మంథని మండలానికి చేరుకుందని తెలిపారు. ప్రజలతో మమేకమైన పుట్ట మధుపై ప్రతిపక్షాల కుట్రలను ఓటుతో తిప్పికొట్టాలని కోరారు. ఎంపీపీ జక్కుల ముత్తయ్య పటేల్, జెడ్పీటీసీ చెలుకల స్వర్ణలత, సర్పంచుల ఫోరం మండల కన్వీనర్ నూనె కుమార్, రైతుబంధు అధ్యక్షుడు అత్తె చంద్రమౌళి, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ రాజిరెడ్డి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల, సిద్దిపేటలా రామగుండం అభివృద్ధి

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి



బీఆర్ఎస్‌లో చేరిన మహిళలతో ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గం అభివృద్ధి సిరిసిల్ల, సిద్దిపేటగా మారబోతోందని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో ప్రతీ నియోజకవర్గానికి రూ.వందలాది కోట్లు మంజూరు చేసి అభివృద్ధికి చిరునామాగా మారుస్తున్నారన్నారు. దశాబ్దాలుగా రామగుండం ప్రజలు ఎదురు చూస్తున్న మెడికల్ కళాశాల కల సాకారం చేసుకున్నామన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేయించామని తెలిపారు. భారీ మెజార్టీతో బీఆర్ఎను గెలిపించి, రామగుండం విజయాన్ని కేటీఆర్‌కు బహుమతిగా అందిద్దామని అన్నారు. దశాబ్ది ప్రగతిసభను విజయవంతం చేసిన సకల జనులకు కృతజ్ఞతలు తెలిపారు. మేయర్ బంగి అనిల్‌కుమార్ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, పాముకుంట్ల భాస్కర్, కొమ్ము వేణు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి చిరునామా తెలంగాణ

సీఎం కేసీఆర్ పాలనలో చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో పలువురు చేరుతున్నారని ఎమ్మెల్యే చందర్ అన్నారు. మున్సిపల్ కార్పొరేటర్ గాదం విజయ ఆధ్వర్యంలో స్థానిక దుర్గానగర్ ఫంక్షన్‌హాల్లో జరిగిన మహిళా మహాసమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు బీఆర్ఎస్‌లో చేరారు. నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్‌కు అండగా నిలవాలి

జ్యోతినగర్(రామగుండం): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు అండగా నిలవాలని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. ఎన్టీపీసీ ట్రాక్టర్ అసోసియేషన్ భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించి మాట్లాడారు. కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, కార్పొరేటర్ రమణారెడ్డి, బీఆర్ఎస్ ఎన్టీపీసీ పట్టణ అధ్యక్షుడు చెప్యాల రామారావు, ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్, సభ్యులు కత్తెరమల్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటే..



మాట్లాడుతున్న సురేశ్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: అబద్ధాలను నిజమనేలా మాట్లాడడంలో మంత్రి కేటీఆర్‌ను మించినవారు ఎవరూ లేరని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాగా చదివానంటూ చెబుతున్న కేటీఆర్.. దేశప్రధానిని గౌరవించలేని సంస్కారహీనంగా మాట్లాడడం దురదష్టకరమన్నారు. అధికారమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కుటుంబం.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గతంలో తమ పార్టీలో విలీనం చేసుకుందని గుర్తుచేశారు. ఈసారి కూడా కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తే బీఆర్ఎస్‌కు అమ్ముడు పోవడం ఖాయమని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రూ.లక్షల కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను బొందపెట్టి కాషాయ జెండా ఎగుర వేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ కందునూరి ప్రమోద్‌రావు, నాయకులు భూమయ్య, మోర మనోహర్, సయ్యద్ ఫయాజ్, శ్రీధర్, లింగంపల్లి కరుణాకర్, వైద తిరుపతి, సంపత్‌చారి, శ్రీకాంత్, రేండ్ల వేణు, రజనికర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీ ఎమ్మెల్యే బంగారం కాదు..

- మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు



మాట్లాడుతున్న విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: 'మీ పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి బంగారమా? ఇక్కడి ప్రజలందరికీ రేకుల దొంగ, మట్టి, ఇసుక దొంగగానే తెలుసు. తుప్పు పట్టిన ఇనుపముక్కను బంగారం అని ఎట్ల చెప్తవ్? అని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు మంత్రి కేటీఆర్‌పై ధ్వజమెత్తారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న తనపై ఎన్నికల్లో గెలిస్తే బీఆర్ఎస్‌లోకి వస్తానంటూ అక్కడక్కడ చెప్పుకుంటున్నారనే వ్యాఖ్యలకు ఆధారాలు చూపుతవా? అని ప్రశ్నించారు. షాడో సీఎం కేటీఆర్, అసలు సీఎం కేసీఆర్ ఎవరొచ్చినా అడ్డుకుంటరనే భయంతో పోలీసులను పంపి ప్రతిపక్షాలను నిలువరించడం అలవాటుగా మారిందని ఆరోపించారు. 24 గంటల కరంటు సరఫరా చేస్తున్నారనే విషయాన్ని నిరూపిస్తే తాను ఈసారి ఎన్నికల్లోనే పోటీచేయనని సవాల్ విసిరారు. పెద్దపల్లి ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు చేయాల్సిన చిన్నపనులను కూడా చేసుకుంటూ ఆర్థికంగా ఇబ్బందుల పాలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతోనే మీ పార్టీ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే తీరుపై అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. అందుకే కేటీఆర్ సభకే పెద్దపల్లి, జూలపల్లి జెడ్పీటీసీలు రాలేదన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజయ్య, నాయకులు సురేశ్‌గౌడ్, అన్నయ్య, మల్లయ్య, దామోదర్, సుభాష్‌రావు, సతీశ్, మహేందర్, విజయ్, రాజు, రాజేశ్వర్‌రెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

విషజ్వరంతో మహిళ మృతి



రజిత(ఫైల్)

ముత్తారం: లక్కారానికి చెందిన బర్ల రజిత(42) విషజ్వరంతో ఆదివారం రాత్రి మృతి చెందింది. రజిత 20రోజుల నుంచి జ్వరంతో బాధపడుతోంది. జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడి వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. అయినా, ఆమె ఫలింత లేక పోయింది. మృతురాలికి భర్త శ్రీనివాస్, కుమారుడు, కూతురు ఉన్నారు.

వ్యాపారి ఆత్మహత్య

జ్యోతినగర్(రామగుండం): ఇటుక బట్టీల వ్యాపారి గీట్ల సత్యనారాయణరెడ్డి(44) మనస్తాపంతో సోమవారం తన ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మల్కాపూర్ గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డి.. మద్యానికి బానిసయ్యాడు. కొద్దిరోజులుగా పిల్లలతో కలిసి భార్య సరిత హైదరాబాద్‌లో ఉంటోంది. భార్య పిల్లలు దూరం కావడంతో మనోవేదనకు గురైన సత్యనారాయణరెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై చక్రపాణి తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

గోదావరిఖని: స్థానిక రాజీవ్‌నగర్‌కు చెందిన సాగి అభిలాష్ (30) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. తనతోపాటు పనిచేసే ఇద్దరు అవమానించడంతో ఈనెల 14న పురుగుల మందు తాగాడాని పేర్కొన్నారు. కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడి తండ్రి సాగి సత్యనారాయణరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ సమ్మయ్య తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలు..

రామగిరి: బేగంపేటకు చెందిన కొట్టె లక్ష్మి (60) సోమవారం బావిలో దూకి మృతి చెందింది. కొద్దిరోజులుగా ఇరుగుపొరుగు వారితో ఉన్న కలహాలతో మానసిక ఒత్తిడికి గురైంది. ఈక్రమంలో వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కొడుకు సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై రవి ప్రసాద్ తెలిపారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

పెద్దపల్లిరూరల్: ప్రధాని నరేంద్రమోదీని విమర్శించే స్థాయి మంత్రి కేటీఆర్‌కు లేదని బీజేపీ నాయకులు అన్నారు. సోమవారం స్థానిక ప్రగతినగర్‌లో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అవినీతి పాలనను సాగిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి కితాబు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. ఆలయ భూములను ఆక్రమించుకున్న ఎమ్మెల్యేకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమని వారు అన్నారు.

బీజేపీకి పలువురి రాజీనామా



రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తున్న నాయకులు

పాలకుర్తి: ఆర్టీసీ మాజీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ ఇటీవల బీజేపీకి రాజీనామా చేశారు. ఆయనకు మద్దతుగా పార్టీ మండల అధ్యక్షుడు పత్తి సంజీవ్, కిసాన్‌మోర్చా, యువమోర్చా, దళిత మోర్చా తదితర విభాగాలకు మండల, గ్రామీణ స్థాయి నాయకులు బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం బసంత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తమ రాజీనామాలను ఫ్యాక్స్ ద్వారా జిల్లా అధ్యక్షుడికి పంపిస్తున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో సోమారపు సత్యనారాయణ గెలుపుకోసం పనిచేస్తామని అన్నారు. నాయకులు మాదాసు రాజేశం, పన్నాల లక్ష్మణ్, బీస సదానందం, కొత్తూరి విజయేందర్, జనగామ మనోజ్, గోండ్ర శ్రీనివాస్, అంకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్నారు..

- అంతర్గాంలో ఘనంగా పీవైఎల్ ఏడోమహాసభ



పతాకావిష్కరణ చేస్తున్న నాయకులు

రామగుండం: ఉద్యోగాల పేరుతో ప్రవేశ పరీక్షలను నిర్వహిస్తూ నిరుద్యోగులను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో కనుమరుగు చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సోమవారం అంతర్గాంలో ప్రజాపంథా అనుబంధ ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) ఏడో మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ, పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యోగాల కోసం ఎదురుచూపులు, రాష్ట్రంలో నిరుద్యోగ భృతి, డీఎస్సీ, గ్రూపు–1 పరీక్ష రద్దు తదితర సమస్యలు అలాగే మిగిలిపోయాయన్నారు. లక్షలాది మంది నిరుద్యోగులను అన్ని విషయాల్లో మోసం చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు భూషన వేణి కృష్ణ, గుజ్జుల సత్యనారాయణరెడ్డి, తోకల రమేశ్, గుమ్మడి వెంకన్న, ఆడెపు శంకర్, పెండ్యాల రమేశ్, మార్త రాములు, కట్టా తేజేశ్వర్, తీగుట్ల రాములు, కోడిపుంజుల మహిపాల్, ఆలకుంట ఎల్లయ్య, నరేశ్, కుమార్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెస్ రాజ్‌ఠాగూర్

- డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. సోమవారం స్థానిక 30వ డివిజన్ సీతానగర్‌లో ఏర్పాటు చేసిన గ్యారెంటీ సభలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆకాంక్ష మేరకు సోనియమ్మ తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే తొమ్మిదేళ్ల నుంచి రాష్ట్రం, రామగుండంలో బీఆర్ఎస్ పాలన పూర్తిగా అవినీతిమయంగా మారిందని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలోనే పేదలకు న్యాయం జరిగిందని, ఈక్రమంలోనే భారీస్థాయిలో చేరికలు వస్తున్నాయని తెలిపారు. రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని కోరారు. నాయకులు మల్లయ్య, బాలయ్య, శ్రీనివాస్ సమ్మాయ్య, బిచ్చన్న, రామస్వామి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దళితుడిని అవమానించిన మంత్రి కేటీఆర్

రామగుండం నగరపాలక ప్రథమ పౌరుడిని మాట్లాడించకుండా దళితుడనే అవమానించారని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివారం బీఆర్ఎస్ దశాబ్ది ప్రగతి సభలో మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. గోదావరిఖని బొందల గడ్డగా కాకుండా చూసేందుకు మంత్రి కేటీఆర్ తండ్రి ప్రస్తుత ముఖ్యమంత్రి ఇక్కడే కూర్చీ వేసుకుని కూర్చుంటానని చెప్పారని, ఇప్పుడేం చేశారని ప్రశ్నించారు. డీఎంఎఫ్‌టీ, సింగరేణి నిధులను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్‌కు ఈప్రాంతంపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే రామగుండంలో పోటీచేయాలని సవాల్ విసిరారు. నాయకులు కాల్వ లింగస్వామి, ఎం.రవికుమార్, బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, పెద్దెల్లి ప్రకాశ్, ముస్తాఫా, గట్ల రమేశ్, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మాట్లాతున్న కూనంనేని

గోదావరిఖని: బీఆర్ఎస్, బీజేపీ ఫైటింగ్ మ్యాచ్ ఫిక్సింగ్‌ను తలపిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో పర్యటించిన ప్రధాని నరేంద్రమోదీ నిజామాబాద్‌లో పసుపు బోర్డు, ములుగులో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన చేశారని, ఇది ఇంకో నాలుగు నెలల్లో జరిగే ఎన్నికల జిమ్మిక్కు అని దుయ్యబట్టారు. ఎన్నికల్లో గెలవడం కోసమే బీజేపీ ప్రభుత్వం ప్రకటనలు చేస్తోందన్నారు. ఎన్నికలు జరిగి నాలుగు సంవత్సరాలు గడిచిన తర్వాత ఈ ప్రకటన చేయడం ప్రజలను ఓట్ల కోసం మోసం చేయడమేనని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాడిస్టుల్లా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. కేసీఆర్‌కు పోయే కాలం దగ్గరలో ఉందన్నారు. ఆత్మహత్యాయత్నం చేసుకునే ప్రయత్నంలో బీఆర్ఎస్ ఉందని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో ప్రజలు బీజేపీ, బీఆర్ఎస్‌లకు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, ముఖ్యంగా లక్ష ఉద్యోగాలు, 25కొత్త గనులు ప్రారంభం, మారుపేర్ల మార్పు ఇంతవరకు అమలు కాలేదని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన సింగరేణి బకాయిలు రూ.29వేల కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వెంటనే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు సీతారామయ్య, రాజ్‌కుమార్, ప్రకాశ్, మిర్యాల రంగయ్య, సారయ్య, వైవీరావు తదితరులు పాల్గొన్నారు.